




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :46 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు మంగళవారం 22 అక్టోబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 46 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE TUE 22 OCTOBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## రుషికొండ భవనాలను ఆకస్మికంగా పరిశీలించిన పవన్ కల్యాణ్



- విజయనగరం జిల్లాలో డయేరియాపై సమీక్ష
- తిరుగు ప్రయాణంలో విశాఖ వచ్చిన పవన్ కల్యాణ్
- స్థానిక నేతలతో కలిసి రుషికొండ భవనాల పరిశీలన

పెన్ పవర్ డెస్క్:విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా పరిస్థితులను సమీక్షించిన అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశాఖ చేరుకున్నారు. అక్కడి రుషికొండ భవనాలను ఆకస్మికంగా పరిశీలించారు. రుషికొండపై ఉన్న టూరిజం విభాగం భవనాలన్నీ కలియదిరిగారు. అధికారులను అడిగి ఆ భవనాలకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు.
ఈ పర్యటనలో పవన్ వెంట జనసేన నేతలతో పాటు విశాఖ ఎంపీ భరత్, ఎమ్మెల్యే విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం, పవన్ కల్యాణ్ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు.



## ఏపీ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తికి కేంద్రం సానుకూల స్పందన

- ఏపీలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు
- ఆ దిశగా కీలక అడుగులు
- ప్రత్యేక చొరవ చూపిస్తున్న మంత్రి నారా లోకేశ్
- ఢిల్లీలో కేంద్రమంత్రులతో భేటీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్ మెంట్ ప్రణాళికలు, దేశంలోనే మొదటిసారిగా జరుగుతున్న స్కిల్ సెన్సస్‌కి సహకారం అందించాలని ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి జయంత్ చౌధురిని కోరారు. ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో స్కిల్ డెవలప్ మెంట్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ కేంద్రమంత్రి జయంత్ చౌధురి, సెక్రటరీ అతుల్ కుమార్ తివారీ, నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీలతో ఏపీ మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్‌పై మంత్రి లోకేశ్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ సెన్సస్ లక్ష్యం ఏమిటి? ఎలా చేపడుతున్నారని కేంద్రమంత్రి

వివరాలు 2లో..

## అసెంబ్లీ సమావేశాలకు జగన్ ను ఆహ్వానిస్తున్నా

- అనకాపల్లి జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం
- హాజరైన ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- నర్సీపట్నంకు 100 రోజుల్లో రూ.40 కోట్లు తీసుకువచ్చానని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నేడు అనకాపల్లి జిల్లాలో 'పల్లె పండుగ' పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొన్నారు. నాతవరం మండలం పెద్దగొలుగుండపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో అయ్యన్న పాత్రుడు రూ.1.4 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ సమావేశాలకు రావాలని జగన్ ను ఆహ్వానిస్తున్నానని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఇద్దరం ముచ్చటించుకుందాం అని పేర్కొన్నారు. ఇక నియోజకవర్గం గురించి మాట్లాడుతూ, నర్సీపట్నంకు 100 రోజుల్లో రూ.40 కోట్లు తీసుకువచ్చానని వెల్లడించారు.

వివరాలు 2లో..

# సీఎంగా ఉన్న ప్రతిసారీ పోలీసు వ్యవస్థను పటిష్ఠపరిచే అనేక చర్యలు

- పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- అన్ని శాఖల కంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని వ్యాఖ్య
- దేశంలోనే ఏపీ పోలీస్‌కు ప్రత్యేక బ్రాండ్ ఉందన్న చంద్రబాబు
- ప్రజల ఆస్తులు, ప్రాణాలు కాపాడేందుకు పోలీసులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని ప్రశంస



పెన్ పవర్ డెస్క్:పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... అన్ని శాఖల కంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని అన్నారు. దేశంలోనే ఏపీ పోలీస్‌కు ప్రత్యేక బ్రాండ్ ఉందన్న చంద్రబాబు.. తాను సీఎంగా ఉన్న ప్రతిసారీ పోలీసు వ్యవస్థను పటిష్ఠపరిచే అనేక చర్యలు చేపట్టానని తెలిపారు. ఏ ప్రగతికైనా పోలీసులే కీలకమని చెప్పారు. ప్రజల ఆస్తులు, ప్రాణాలు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. ఇలా ప్రజాసేవ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. పోలీసుల సంక్షేమం కూటమి ప్రభుత్వం బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించామన్నారు. 2014-2019లో పోలీసు శాఖకు రూ.600 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60 కోట్లు, కొత్తగా వాహనాల కోసం రూ.150 కోట్లు, ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలుకు రూ.27 కోట్లు, పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి చెప్పారు. విశాఖలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించామన్నారు. కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20 కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించామన్న సీఎం... దిశ పేరుతో వాహనాలకు రూ.16 కోట్లు పెండింగ్ పెడితే వాటిని కూడా చెల్లించినట్టు వివరించారు.

## వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన స్థలాల్లో సోదాలపై ఈడీ ప్రకటన

- ఇటీవల విశాఖలో మాజీ ఎంపీ ఎంవీవీకి చెందిన స్థలాల్లో ఈడీ సోదాలు
- ఐదు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించామన్న ఈడీ
- రూ.200 కోట్ల విలువైన 12.51 ఎకరాలు అన్యాక్రాంతం కావడంపై వివరణ



వివరాలు 2లో..

## మహిళలకు సీఎం చంద్రబాబు దీపావళి కానుక

- ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- దీపావళి నుంచి అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటన
- సూపర్ సిక్స్ పథకాల అమలుకు కట్టుబడి ఉన్నామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దీపావళి కానుక ప్రకటించారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చే పథకాన్ని దీపావళి నుంచి అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 5 సంతకాలతో మేనిఫెస్టో హామీలను, అన్న క్యాంటీన్ ల వంటి కార్యక్రమాలను అమల్లోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం... ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల అమలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 31వ తేదీ నుంచి దీపావళి సందర్భంగా దీపం పథకాన్ని మహిళలకు అందించనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో దీపం పథకం కింద మూడు సిలిండర్లు ఏడాదికి ఉచితంగా ఇస్తామని నాడు ప్రతిపక్ష నేతగా

వివరాలు 2లో..

## సొంత కొడుకై ఉండి జగన్ ఈ పథకాన్ని నీరుగార్చారు

- వైఎస్సార్ ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం తెచ్చారన్న షర్మిల
- జగన్ రూ.3,500 కోట్లు పెండింగ్ లో పెట్టాడని ఆరోపణ
- ఆ నిధులను చంద్రబాబు విడుదల చేయాలంటూ షర్మిల డిమాండ్



పెన్ పవర్ డెస్క్:ఫీజు రీయింబర్స్ మెంట్ అంశంలో మాజీ సీఎం జగన్ పై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మానస

వివరాలు 2లో..

## గడ్చిరౌలిలో భారీ ఎన్ కౌంటర్.. నలుగురు మావోయిస్టులు హతం



పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లాలో సోమవారం (అక్టోబర్ 21) భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు నక్సలైట్లు హతమయ్యారు. కాల్పుల్లో కొందరు జవాన్లు గాయపడ్డారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దులోని గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తహసీల్ కోప్రి అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఘటన స్థలంలో ఆపరేషన్ కొనసాగుతోందని

వివరాలు 2లో..

# కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్ గా మారబోదు



- జమ్మూకశ్మీర్ లో ఉగ్రదాడిని ఖండించిన ఫరూక్ అబ్దుల్లా
- పాకిస్థాన్ నేతలకు తీవ్ర హెచ్చరిక జారీ చేసిన ఎన్సీ అధినేత
- ఉగ్రవాదానికి ముగింపు పలకాలని హితవు

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్ లో జరిగిన టెర్రరిస్టుల దాడిలో ఒక డాక్టర్ తో పాటు ఆరుగురు నిర్మాణ రంగ కార్మికులు చనిపోయారు. ఈ ఉగ్రదాడిని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. పాకిస్థాన్ నేతలను ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తో సత్సంబంధాలు కావాలనుకుంటే ఉగ్రవాదానికి ముగింపు పలకాలనే విషయాన్ని పాక్ నేతలకు తాను చెప్పదలుచుకున్నానని అన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలను గౌరవంగా బతకనివ్వాలని చెప్పారు.

వివరాలు 2లో..



## పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు నోటీసులు

- తిరుమల లడ్డూ వ్యవహారంలో పవన్ వ్యాఖ్యలపై పిటిషన్
- హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని పిటిషన్ వేసిన న్యాయవాది రామారావు
- నవంబర్ 22న కోర్టుకు హాజరు కావాలంటూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సమన్లు

పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు హైదరాబాద్ లోని సిటీ సివిల్ కోర్టు సమన్లు జారీ చేసింది. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో ఈ సమన్లు జారీ చేసింది. లడ్డూ నాణ్యతపై పవన్

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

# పంట వ్యర్థాలే కాలుష్య కారకాలు

శీతాకాలం సమీపిస్తుండటంతో ఢిల్లీ, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు మళ్లీ వాయు కాలుష్యానికి స్వాగతం ఇస్తున్నాయి. గత నెల ప్రధాని కార్యాలయం ఈ రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించింది. ఢిల్లీలో వాయు నాణ్యత క్షీణించకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించింది. వాహనాల కాలుష్యంతోపాటు, రోడ్లు, నిర్మాణాల దుమ్ముధూళి, ఘనవ్యర్థాల నిర్వహణ ఇవన్నీ గత కొన్నేళ్లుగా వాయు కాలుష్యానికి దారి తీస్తున్నాయని చర్చించారు. పంజాబ్, హర్యానాల్లో పంట వ్యర్థాలను మండించడం పెద్ద సమస్యగా తయారైంది. అక్టోబర్, నవంబర్ నెలలో కాలుష్యంలో 40% ఈ పంట వ్యర్థాలే కారణమవుతున్నాయి. ఈ ఏడాది పంజాబ్‌లో 19.52 మిలియన్ టన్నులు, హర్యానాలో 8 మిలియన్ టన్నుల వరి వ్యర్థాలను దగ్ధం చేస్తారని అంచనా. ఈ రెండు రాష్ట్రాలూ ఈ ఏడాది పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా నివారిస్తామని హామీ ఇచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో సుప్రీం కోర్టు ఈ పంట వ్యర్థాల కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పంట వ్యర్థాలను దగ్ధం చేయకుండా పూర్తిగా నిలువరించాలని ఆదేశించింది. ఈ ఏడాది రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా కేంద్రం తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది. 2023 పంటకోతల సీజన్‌లో పంజాబ్‌లో పంట వ్యర్థాల దగ్ధం సంఘటనలు 2022 తో పోలిస్తే 59% తగ్గాయి. అలాగే హర్యానాలో 2023లో 40% తగ్గాయి. కానీ ఉత్తరప్రదేశ్‌లో మాత్రం పంటవ్యర్థాల దగ్ధం సంఘటనలు 30% పెరగడం గమనార్హం. ఈ సమస్య నివారణకు ఆర్థిక రాయితీలు కల్పించడం, ఇతర చర్యలు తీసుకోవడం తప్పనిసరి. పంట వ్యర్థాలను 11.5 మిలియన్ టన్నుల వరకు దగ్ధం చేయకుండా పొలాల్లోనే వాటిని వినియోగించడం, మిగతా వ్యర్థాలను బయటకు తరలించడం చేస్తామని పంజాబ్ పేర్కొంది.దీంతో పాటు 2 మిలియన్ టన్నుల వరిగడ్డి వ్యర్థాలను ఎన్‌సిఆర్ రీజియన్‌లోని థర్మల్ పవర్ ప్లాంట్లలో మండించడానికి వినియోగిస్తున్నారు. అంటే వరిగడ్డి వ్యర్థాలను గుళికలుగా తయారు చేసి కార్బన్ వనరుగా వినియోగిస్తుంటారు. అయితే దీనికి కావలసిన యంత్రాలు రైతులకు అందుబాటులో లేవు. విద్యుత్ ప్లాంట్లలో పంట వ్యర్థాలను వినియోగించడం ఒక పరిష్కార మార్గమే అయినప్పటికీ, పొలం నుంచి పవర్‌ప్లాంట్‌కు ఈ వరిగడ్డి గుళికలను రవాణా చేసే వ్యవస్థ లేదు. పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కచ్చితమైన విధానాలు పాటించకపోవడం రైతులకు నష్టాలకు దారితీస్తోంది. సీజన్‌లో రెండు పంటలు వేస్తేనే కానీ తమకు నష్టాలు తీరవన్న ఉద్దేశంతో రైతులు వరిగడ్డిని దగ్ధం చేసి గోధుమ పంట సాగుకు సమాయత్తం అవుతుంటారు. అదే పంట వ్యర్థాల దగ్ధానికి దోహదమవుతోంది. వరికి బదులుగా పెసర వంటి పప్పు ధాన్యాల సాగును చేపట్టినా గిట్టుబాటు ధర లభించడం లేదు.అందువల్ల చేసేది లేక వరిని సాగు చేయవలసి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరిగడ్డి దగ్ధం వల్ల ఉత్పన్నమయ్యే కాలుష్యాల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాజకీయాలను పక్కనపెట్టి సమష్టిగా కృషి చేస్తేనే కానీ సత్ఫలితాలు రావు. ఢిల్లీలో గత ఏడాది రికార్డు స్థాయిలో వాయు నాణ్యతా ప్రమాణాలు పడిపోయాయి. మళ్లీ గత కొన్ని రోజులుగా వాయు నాణ్యత క్షీణిస్తోంది. గత మూడు నెలల్లో మొదటిసారి ఎక్యుఐ (వాయు నాణ్యత ప్రమాణాలు) 200 నుంచి 300 మధ్యకు చేరుకుంది. ఐక్యుఎయిర్ 2023 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక కాలుష్య దేశాల్లో మన దేశం మూడో స్థానంలో ఉంది. దేశంలో సగటున క్యూబిక్ సెంటీమీటర్‌కు ఎయిర్‌బోర్న్ పర్టిక్యులర్ మేటర్ (ఎం.పి) 2.5 మైక్రోగ్రామ్స్ గాను, గాఢత 54.4 మైక్రోగ్రామ్స్ గాను కొనసాగుతోంది.గాలిలో కాలుష్యానికి కారణమయ్యే వివిధ రకాల వాయువులు, రసాయనాల మిశ్రమాన్ని ఎంపిగా పేర్కొంటారు. వాయు కాలుష్యం కారణంగానే మన దేశంలో సగటున సంవత్సరానికి రూ. 2.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతోందని నివేదికలు చెబుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తిలో ఇది 1.36 శాతం. వాహనాల నుంచి పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు, రసాయన వాయువులు, పరిశ్రమల నుంచి వెలువడే సల్ఫర్‌డైయాక్సైడ్, కార్బన్ డైయాక్సైడ్ కాలుష్యాలతో వాతావరణం పూర్తిగా కలుషితమవుతోంది. పంట వ్యర్థాలను దగ్ధం చేయడంతో శీతాకాలంలో ప్రజలకు శ్వాసకోశ సమస్యలు, గుండెజబ్బులు, అకాల మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) ప్రస్తుతం వాయు నాణ్యత పిఎంను 2.5 కంటే తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యంలో కనీసం 20నుంచి 40 శాతం వరకైనా 2026 నాటికి సాధించవలసి ఉంది. ఈ మేరకు లక్ష్యాలను సాధించకపోతే ఢిల్లీలో ఎవరూ నివసించలేని దుర్భర పరిస్థితి దాపురిస్తుంది.

# సొంత కొడుకై ఉండి జగన్ ఈ పథకాన్ని నీరుగార్చారు

- మొదటి పేజీ తరువాయి

పుత్రిక అని, మహానేత హయాంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఒక ప్రతిష్ఠాత్మక పథకం అని వెల్లడించారు. పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపి, ఎంతో మంది ఇంజినీర్లను, డాక్టర్లను తయారుచేసిన గొప్ప పథకం అని షర్మిల అభివర్ణించారు.

అయితే, నాడు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని వైఎస్సార్ అద్భుతంగా అమలు చేస్తే... ఆయన సొంత కొడుకై ఉండి జగన్ ఈ పథకాన్ని నీరుగార్చారని విమర్శించారు. జగన్ హయాంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3,500 కోట్లు పెండింగ్ లో పెట్టడం నిజంగా సిగ్గుచేటు అని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారని, తల్లిదండ్రులను మనోవేదనకు గురిచేశారని మండిపడ్డారు. దోచుకుని దాచుకోవడం మీద ఉన్న శ్రద్ధ విద్యార్థుల సంక్షేమంపై చూపలేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్ తన జీవితం మొత్తం మత పిచ్చి బీజేపీని వ్యతిరేకించారని, కానీ అదే బీజేపీకి జగన్ దత్తపుత్రుడు అయ్యారని షర్మిల విమర్శించారు. బీజేపీతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన మోదీ వారసుడు జగన్ అని అభివర్ణించారు. అలాంటి వ్యక్తులకు వైఎస్సార్ ఆశయాలు గుర్తుంటాయని అనుకోవడం, వారు వైఎస్సార్ ఆశయాలకు వారసులు అవుతారని అనుకోవడం పొరపాటు అని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే, నేడు కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ చేసింది మహాపాపమైతే, కూటమి సర్కారు విద్యార్థులకు పెడుతున్నది శాపమని విమర్శించారు.

"ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం... బకాయిలు ఎవరు పెట్టినా, వాటిని విడుదల చేయాల్సిన బాధ్యత మీపై ఉంది. వెంటనే నిధులు విడుదల చేయండి... ఫీజు రీయింబర్స్ మెంట్ పథకానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ తరఫున స్పష్టం చేస్తున్నాం" అని షర్మిల సోషల్ మీడియాలో స్పందించారు.

## వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన స్థలాల్లో సోదాలపై ఈడీ ప్రకటన

పెన్ పవర్ డెస్క్:ఇటీవల విశాఖలో వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు చెందిన స్థలాల్లో ఈడీ దాడులు చేపట్టడం తెలిసిందే. ఈ సోదాలపై ఈడీ నేడు ప్రకటన చేసింది. అక్టోబరు 19వ తేదీన విశాఖలోని ఐదు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించామని వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం ఉల్లంఘనలపై ఈ సోదాలు చేపట్టినట్టు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ వివరించింది. రూ.200 కోట్ల విలువైన 12.51 ఎకరాలు అన్యాక్రాంతం కావడంపై దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొంది. వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాల కోసం ప్రభుత్వం భూమిని కేటాయించిందని, ఆ భూమిని మోసపూరితంగా అన్యాక్రాంతం చేశారని ఈడీ వివరించింది. అరిలోవ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించింది.

## అసెంబ్లీ సమావేశాలకు జగన్ ను ఆహ్వానిస్తున్నా

- మొదటి పేజీ తరువాయి

నాతవరం మండలానికి భారీగా నిధులు కేటాయించామని, తాండవ గేటు మరమ్మతు పనులు పూర్తి చేయించామని అయ్యన్నపాత్రుడు వివరించారు. పంట సీజన్ ప్రారంభమైన వెంటనే కొత్త గేటు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. పోలవరంపై తాండవ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వెల్లడించారు. తాండవ ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం రూ.2,900 కోట్లు అని అయ్యన్న పేర్కొన్నారు. తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు.

అటు, నర్సీపట్నంలో ఇసుక అక్రమ నిల్వలను పట్టుకున్నామని, ఇసుక అక్రమ

నిల్వలకు మాజీ ఎమ్మెల్యే బినామీలే కారణమని ఆరోపించారు. ఇసుక అక్రమ నిల్వలకు రూ.18 కోట్ల జరిమానా పడిందని తెలిపారు. గుమ్మడిగొండ, అల్లిపూడిలో ఇసుక తవ్వకాల్లో దోపిడీ జరిగిందని అన్నారు.

## మహిళలకు సీఎం చంద్రబాబు దీపావళి కానుక

- మొదటి పేజీ తరువాయి

ఉన్న చంద్రబాబు ప్రకటించారు.ఈ కార్యక్రమంపై నేడు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్,ఆ శాఖ అధికారులు, చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్, హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రతినిధులతో సీఎం సమీక్షించారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై సమీక్ష జరిపారు.మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని....దీపావళి నుంచి సూపర్ సిక్స్ కార్యక్రమాల్లో భాగమైన దీపం పథకం అమలు గొప్ప ముందడుగు అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దీపం పథకంతో ఈ దీపావళి పండుగ ఇళ్లల్లో వెలుగులు తెస్తుందని అన్నారు. ఆర్థిక సమస్యలు ఉన్నా....పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాలు విషయంలో ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అర్హులైన మహిళలందరికీ పారదర్శక విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను అందించడం జరుగుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ కలిగి, అర్హతగల ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని వర్తింప చేయాలని అన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం అమలులో భాగంగా ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్దిదారు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఈనెల 24 నుండి బుకింగ్ చేసుకునే ఏర్పాట్లు చేయాలని ఈనెల 31వ తేదీ నుండి గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించడం జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ తీసుకున్న లబ్దిదారులకు రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీని జమచేయాలని, ఆ విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్థిక కష్టాలు ఉన్నా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టామని సిఎం అన్నారు. అర్హత గల ఏ ఒక్క లబ్ధిదారునికి ఈ పథకం రాలేదనే విమర్శ రాకుండా కట్టుదిట్టంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో తొలుత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ రిటైల్ మార్కెట్ ధర రూ.876 లు కాగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలిండర్ కు రూ.25ల సబ్సిడీ ఇస్తుండగా ప్రస్తుతం ప్రతి సిలిండర్ ధర రూ.851లుగా ఉందని వివరించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వల్ల ప్రభుత్వంపై రూ.2,684 కోట్ల భారం పడుతుందని, అదే ఐదేళ్ళకు కలిపి రూ.13,423 కోట్ల భారం పడుతుందని వివరించారు.

## గడ్చిరౌలిలో భారీ ఎన్ కౌంటర్.. నలుగురు మావోయిస్టులు హతం

- మొదటి పేజీ తరువాయి

అధికారులు వెల్లడించారు. కాగా, తహసీల్ కోర్చి అటవీ ప్రాంతంలో నక్సలైట్లు ఉన్నారన్న ఇంటలిజెన్స్ సమాచారంతో పోలీసులు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. స్థానిక పోలీసులు, నక్సల్ వ్యతిరేక దళం సీ60 జవాన్లు కూంబింగ్ నిర్వహిస్తుండగా.. మావోయిస్టులు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఇరువైపులా నుండి కాల్పులు జరిగాయి. భద్రతా దళాల కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు హతం కాగా.. మరి కొందరు గాయపడ్డట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టుల కాల్పుల్లో ఓ జవాన్ గాయపడగా.. చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. ఘటన స్థలంలో ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఎన్ కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టుల వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, నక్సల్

ప్రభావిత రాష్ట్రాలైన ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా ఇటీవల భద్రతా దళాలు దూకుడు పెంచాయి. ఒక్క ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోనే గడిచిన నాలుగు నెలల్లో దాదాపు 150 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్‌లో హతమయ్యారు. గత నెల (సెప్టెంబర్)లో జరిగిన ఓ ఎన్ కౌంటర్‌లో దాదాపు 40 మంది మావోయిస్టులు ఒకేసారి మరణించడం గమనార్హం.

## ఏపీ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తికి కేంద్రం సానుకూల స్పందన

- మొదటి పేజీ తరువాయి

ఆరా తీశారు. స్కిల్ సెన్సస్ పైలెట్ ప్రాజెక్టు పూర్తి కాగానే గుర్తించిన లోటుపాట్లు సరిచేసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని లోకేశ్ వివరించారు.

కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా స్కిల్ డెవలప్ మెంట్, స్కిల్ సెన్సస్ చేపట్టిందని తెలిపారు. స్కిల్ డెవలప్ మెంట్ లక్ష్యం చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, మంత్రిత్వశాఖల నుంచి ఏపీకి ఏమేం కావాలో వివరిస్తూ ఓ లేఖను మంత్రి నారా లోకేశ్ అందజేశారు.లోకేశ్ విజ్ఞప్తి పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించింది. కేంద్రం నుంచి పూర్తి సహకారం ఉంటుందని కేంద్రమంత్రులు హామీ ఇచ్చారు. ఢిల్లీ కౌశల్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ తోపాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో గణేశ్ కుమార్, ఈడీ దినేశ్ కుమార్ పాల్గొన్నారు.

**మంత్రి లోకేశ్ కోరిన సంస్థలు, సహకారం వివరాలు...**

పబ్లిక్- ప్రైవేటు పార్టనర్ షిప్ మోడల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ అమరావతిలో నెలకొల్పాలి.

వారణాసి, హైదరాబాద్ లలో విజయవంతంగా నడుస్తున్న మాదిరిగానే స్కిల్ ఇండియా ఇంటర్నేషన్ సెంటర్ ఇన్ అమరావతి కావాలి

గతంలోనే విశాఖపట్నంలో ఏడు ఎకరాలు కేటాయింపు జరిగిన చోట నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి

మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ , అమరావతిలో నిర్మాణరంగం, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చేనేత-హస్తకళలు, విశాఖలో ఫార్మా లాబ్స్, నెల్లూరు, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలు నెలకొల్పేందుకు స్కిల్ కౌన్సిల్ సహకారం అందించాలి.

పీఎంకేవీవై (ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన) కేటాయింపులు జరగాలి.

నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ వెబ్ సైట్లతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ అనుసంధానం చేయాలి.

గిరిజనుల నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలి

## కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్ గా మారబోదు

- మొదటి పేజీ తరువాయి

కశ్మీర్ ఎప్పటికీ పాకిస్థాన్ గా మారబోదని వ్యాఖ్యానించారు.

గత 75 ఏళ్లుగా గొప్ప పాకిస్థాన్ ను తయారు చేసుకోలేకపోయారని... ఇప్పుడు ఏం చేయగలుగుతారని ప్రశ్నించారు. ఉగ్రవాదానికి ముగింపు పలకాలని... లేకపోతే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అమాయక ప్రజలను చంపుతుంటే... భారత్ తో చర్చలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. జీవనోపాధి కోసం వచ్చిన పేద కార్మికులు, ఒక డాక్టర్ ఉగ్రవాదుల దాడిలో చనిపోయారని... ఇది చాలా బాధాకరమైనదని అన్నారు.

## పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

చేసిన వ్యాఖ్యలతో హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతిన్నా యంటూ రామారావు అనే న్యాయవాది పిటిషన్ వేశారు. ఆధారాలు లేకుండా లడ్డూ నాణ్యతపై వ్యాఖ్యలు చేశారని తన పిటిషన్ లో రామారావు పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా గ్యాగ్ ఆర్డర్ ఇవ్వాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్ ను విచారించిన కోర్టు పవన్ కు సమన్లు జారీ చేసింది. నవంబర్ 22న విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లలో పేర్కొంది.

## టీడీపీ కార్యాలయం, చంద్రబాబు నివాసంపై దాడి కేసులు.. సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం, ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడి నివాసంపై దాడి కేసుల విచారణను సుప్రీంకోర్టు డిసెంబర్ 17కు వాయిదా వేసింది. అత్యున్నత న్యాయస్థానం నేడు ఈ కేసులను విచారించింది. ఈ రెండు కేసుల్లో నిందితులుగా ఉన్న వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, జోగి రమేశ్ సహా పలువురి పిటిషన్లపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. దీంతో వాటికి రిజాయిండర్ దాఖలు చేస్తామని, అందుకు కొంత సమయం కావాలని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టును అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను డిసెంబర్ 17కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి వరకు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న ఉపశమనం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# బడ్జెట్ ఎప్పుడు...

**విజయవాడ, అక్టోబరు 21, పెన్ పవర్:** ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయ అంచనాలు ప్రతి ఏడాది మార్చిలోనే అసెంబ్లీలో పెడతారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరిలోనే ఆ పని చేస్తుంది. అందులో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, ఇతర వివరాలు చూసుకుని పద్దు రెడీ చేసుకుంటారు. ఆంధ్రప్రదేశ్ ఈ ఏడాది బడ్జెట్ లేకుండానే నడిచిపోతోంది. ఎన్నికల కారణంగా జగన్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ పెట్టింది. అధికారంలోకి వచ్చిన టీడీపీ నాలుగు నెలలైనా ఆర్థిక పరిస్థితిపై పూర్తి సమాచారం తెలియడం లేదని ఇంకా బడ్జెట్ పెట్టలేదు. దీనిపై వైఎస్ఆర్సీపీ విమర్శలు గుప్పిస్తోంది. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఓటాన్ అకౌంట్.. టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా పద్దులు నిర్వహిస్తున్నారు. జూన్‌లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కాస్త చక్కదిద్దిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని చెప్పింది. ఓటాన్ అకౌంట్ ద్వారా ఆగస్ట్ నుంచి నవంబర్ వరకు నాలుగు నెలల కోసం రూ. 1,29,972.97 కోట్లకు గవర్నర్ అనుమతి తీసుకుంది. ఈ సారి మాత్రం తప్పనిసరిగా బడ్జెట్ ప్రవేశ పెట్టాల్సిందే. అందుకే నవంబర్‌లో ఈ పని పూర్తి చేయాలని అనుకుంటోంది. ఆషామాషీగా బడ్జెట్ ప్రవేశ పెడితే సరిపోదు.. సూపర్ సిక్స్ పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు హామీలు ఇచ్చింది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే వృద్ధాప్య, ఇతర పెన్షన్ల మొత్తాన్ని పెంచి అమలు చేస్తున్నారు. మిగతా పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉంది. మెజార్టీ నిధులు సంక్షేమ పథకాలకే వెచ్చించాల్సి ఉంటుంది. నిధుల సమీకరణ, కేటాయింపుల విషయంలో ఆర్థిక శాఖ అధికారులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఒక్కో పథకానికి ఎంత ఖర్చు అవుతుందనే లెక్కలు వేస్తున్నారు. గత ప్రభుత్వంలో పూర్తిగా సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చారు. దాని వల్ల ఆర్థిక కార్యకలాపాలు మందగించాయి. ఈ బడ్జెట్‌లో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుకు కూడా ప్రాధాన్యత అంశంగా నిధులు కేటాయించనున్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు, సాయంపైనా స్పష్టత రావడంతో అధికారుల బడ్జెట్ రూపకల్పనలో బిజీగా ఉన్నారు. మరో వైపు వైసీపీ అధినేత జగన్ నాలుగు నెలలు గడిచినా సూపర్ సిక్స్ లేదని.. సూపర్ సెవన్ లేదని అసలు డీబీటీనే అమలు కావడం లేదని అంటున్నారు. తాను ఉన్నట్లయితే ఈ పాటికి రైతు భరోసా, అమ్మఒడి అన్నీ జమ చేసేవాడినని అంటున్నారు. అయితే ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి బహిరంగసభలు పెట్టి బటన్ నొక్కిన నిధులు కూడా విడుదల చేయలేదని ఆయన



మరోసారి వచ్చి ఉన్నట్లయితే ఏపీ దివాలా తీసి ఉండేదని టీడీపీ నేతలు మండి పడుతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది.. బడ్జెట్ ప్రవేశ పెడతున్నామని హామీ ఇచ్చిన ప్రతి పథకం అమలు చేస్తామని భరోసా ఇస్తున్నారు.

# ఇంకా రైతు సాయుధ పోరాటం గుర్తులు

**శ్రీకాకుళం, అక్టోబరు 21, పెన్ పవర్:** నాటి నక్సల్ బరి, గిరిజన సాయుధభూపోరాటం నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు సిక్కోలు జిల్లా పేరు మార్మోగుతోంది. ఉద్యమాల ఖిల్లా సిక్కోలు జిల్లా అంటు చరిత్రలో నిలుస్తోంది. నాడు భూ స్వాములు పెత్తనం, వైద్య, విద్య,రహదార్లులేక నానా అవస్థలు పడడంతో ఉద్యమం 1960 లో మొదలైంది. ఇది రాను రాను సాయుధ భూపోరాటంగా మారింది. అమరులైన కామ్రేడ్స్ వెంపటాపు సత్యం, ఆదిబట్ల కైలాసంతో ప్రారంభమై ఉద్దానం ప్రాంతానికిచెందిన పంచాది కృష్ణ మూర్తి, తామాడ గణపతిలు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారు. వారికి సుబ్బారావు పాణిగ్రాహి, చాగంటి భాస్కర రావు, మల్లికార్జున, పంచాది నిర్మల, సరస్వతి అంకమ్మలు ఇలా అనేక మంది జిల్లా కు చెందిన వారే ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు.1968 సంవత్సరం నవంబర్ 25న నూతన విప్లవ పంథా నాయకుడు వెస్ట్ బెంగాల్ కు చెందిన కామ్రేడ్ చారు మజుందార్ పిలుపు మేరకు శ్రీకాకుళం సాయుధ పోరాటం ప్రారంభమైందని చెప్పుకుంటుంటారు. ఈ ఉద్యమ నాయకుల్లో పంచాది కృష్ణమూర్తి, తామాడ గణపతి,నిర్మల తదితరులు 1969 మే 27న ఎన్ కౌంటర్ అయ్యారు. ఆ ఎన్ కౌంటర్ లో ఆరుగురు కామ్రేడ్స్ పంచాది కృష్ణ మూర్తి, తామాడ చినబాబు, బైనపల్లి పాపారావు, దున్న గోపాల్ రావు, రామచంద్ర ప్రధానో, నిరంజన్ సాహు, శృంగవరపు నర్సింహా మూర్తి అమరులయ్యారు. ఇది తొలిభూటకపు ఎన్ కౌంటర్ గా అప్పటి నక్సబరి పార్టీ ప్రకటించింది. ఈ అమరులైన వారిలో పలాస మండలం బొడ్డపాడుకు చెందిన పంచాది కృష్ణమూర్తి వంటి ముఖ్యనేతలున్నారు. అప్పటినుంచి బొడ్డపాడుకు ప్రత్యేకత సంతరించుకుంది. ఉవ్వెత్తి ఎగిసిపడిన శ్రీకాకుళం సాయుధపోరాటం దేశవ్యాప్తంగా సంతరించుకుంది. శ్రీకాకుళ పోరాటం వెనకడుగు వేసినా శ్రీకాకుళం నిప్పురవ్వలు దేశం నలుమూలలా వెదజల్లి రైతాంగ ఉద్యమాలను సృష్టిస్తున్న శ్రీకాకుళ సాయుధ పోరాటానికి విప్లవ జేజేలు పలికారు. ఓ వైపు ఉద్యమం కొనసాగిస్తునే మరో వైపు విద్యాభివృద్ధి ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి బొడ్డపాడులో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉద్దానం ప్రాంతానికి

చెందిన వారే మావోపార్టీలో పనిచేసిన వారున్నారు. బొడ్డపాడులో కూడ గతంలో మావో పార్టీలో పనిచేసి జైలు జీవితాన్ని అనుభవించిన వారున్నారు. ఉద్యమాలు పేరు చెప్పిన వెంటనే ప్రధానంగా గుర్తొచ్చేది శ్రీకాకుళం జిల్లా ఉద్యమం అలాంటి ఉద్యమం ఈరోజు చాలా నీరుగారిపోయింది అప్పుడు ఉన్న నేతలు లేరు ఎంతో పేరు ప్రత్యర్థులు కందిన మావోయిస్టులుగా ఈ ప్రాంతం పేరు ప్రఖ్యాతలు తీసుకొని వచ్చింది వాళ్ళు గుర్తులుగానే నేటికీ కొన్ని స్థూపాలు విగ్రహాలను కూడా ఇక్కడ స్థాపించారు. ఇప్పటికి కూడ భూస్వామ్య వ్యవస్థపై పోరాడుతునే ఉంటారు. బొడ్డపాడు గ్రామమంటే నిరంతరం పోలీసులు నిఘా పెట్టే రోజులే అధికమని చెప్పాలి. ఈ సందర్భంగానే బొడ్డపాడులో తొలుత గ్రంథాలయాన్ని కూడ ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆ గ్రామంలో పంచాది కృష్టమూర్తి , చారుమజూందర్ వంటి అగ్రనేతలు విగ్రహాలున్నాయి. ఆ గ్రామాన్ని సందర్శిస్తే ఉద్యమకారులు, రచయతులు, మాజీ మావో సభ్యులుకనపిస్తారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధపోరాట గత స్మృతులను నెమరు వేసుకుంటును ఉంటారు. అమరుల బంధుమిత్రుల కమిటీ ఏర్పాటు చేసారు. రాష్ట్ర కార్య దర్శి పద్మకుమారి మాట్లాడుతూ శ్రీకాకుళ ఉద్యమం లో పంచాది నిర్మల వంటి ఎంతో మంది మహిళలు పాల్గొని నేటి మహిళాలోకానికి ఆదర్శమయ్యారని, ఇప్పుడు కూడా మావోయిస్టు ఉద్యమంలో మహిళల పాత్ర ఎక్కువగానే ఉందన్నారు. అమరుల బంధు మిత్రుల కమిటీ రాష్ట్ర నాయకులు జోగి కోదండరావు మాట్లాడుతూ సరిగ్గా ఇదే రోజున 1969 మే 27న నిరాయుధులైన పంచాది కృష్ణమూర్తి, తామాడ చిన బాబు, బైనపల్లి పాపారావు, దున్న గోపాలరావు, రామ చంద్ర ప్రదానో, నిరంజన్, శృంగవరపు నరి సింహులును పట్టుకొని కాల్చి చంపి ఎన్కౌంటర్గా చిత్రీకరించారని ఆప్రాంతీయులు వర్ధంతి సభలో వెల్లడిస్తుంటారు.ఉద్యమం కోసం ప్రజల రక్షణ కోసం ఏదో సాధిద్దామని ఇందులోకి వచ్చాము పోరాటాలు వైపు వెళ్లి కొన్ని దళాల్లో పనిచేసే వచ్చాము కానీ ప్రజల్లో మాత్రం ఎటువంటి మార్పు లేదు భూస్వాములు చేసే ఆగడాలు ఎన్ని అన్ని కాదు దళితులపై నేటికీ ఎన్నో అవమానాలు కూడా ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ పోలీసులు మా ప్రాంతానికి వచ్చి నా పేరుతో సహా ఈశ్వరి అనే పేరుతో పోలీస్ స్టేషన్లో రికార్డులు ఉన్నాయి కనుక వాళ్ళు వచ్చి ఎప్పటికప్పుడు నా కోసం సమాచారాలు కూడా తీసుకుంటుంటారు. ప్రజల కోసం పోరాడి చివరకు నాకు సెంటు భూమి గానీ లేకుండా ఉంది నా భర్తను కూడా పోలీసులు కాల్చి చంపారు .. భూస్వాముల నుంచి జరుగుతున్న అరాచకాలు చూడలేక బొడ్డపాడు పలాస నుండి ఎక్కువగా ఈ ప్రాంత ప్రజలు ఉద్యమంలోకి ఎక్కువగా వెళ్లారు ఎంతోమంది పోలీస్ కాలపుల్లో మృతి చెందారు .ఆ తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చి నా పిల్లల్ని పోషించుకుంటూ బ్రతుకుతున్నానని మాజీ దళం ఈశ్వరమ్మ చెప్పారు

# విజయనగరం జిల్లాలో డయేరియా విలయ తాండవం

**విజయనగరం, అక్టోబరు 21, పెన్ పవర్:** విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా విలయ తాండవం చేస్తుంది. వాంతులు, విరోచనాలతో నాలుగు రోజుల వ్యవధిలో ఏడుగురు మృతి చెందారు. ఇంకా గ్రామంలో డయోరియా అదుపులోకి రాలేదు. వంద మందికి పైగా రోగులు చికిత్స పొందుతున్నారు. డయోరియాను అదుపు చేసేందుకు అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. గుర్ల మండలంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయోరియాను అదుపు చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఇరవై రెండు మంది రోగులు జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరొక ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్ కు తరలించారు. రోగులు పరిస్థితి నిలకడగా ఉన్నట్లు చెబుతున్నారు వైద్యాధికారులు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 22 మంది, చీపురుపల్లి సిహెచ్సిలో 13 మంది, విజయనగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో 15 మంది చొప్పున చికిత్స పొందు తున్నారు. ఇంకా కొంతమంది తమ ఇళ్లల్లోనే వాంతులు, విరేచనాలతో మంచాలపై ఉన్నారు. మృతుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రామస్తులు భీతిల్లుతున్నారు. గుర్ల, గోషాడ, పున్నపురెడ్డిపేట, కెల్ల, గూడెం, కోటగండ్రేడు గ్రామాల్లో డయేరియా కేసులు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. గుర్ల గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. రోగులందరికీ డయేరియా నివారణ చికిత్స చేస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. గ్రామంలో బోర్లు, కుళాయిల నీటి వాడకాన్ని నిషేదించారు. క్లోరినేషన్ చేసిన నీటి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్టు ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్ చెబుతున్నారు. ఈ గ్రామాన్ని చిన్నతరహార పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఉదయం సందర్శించారు. వైద్యాధికారులు, పంచాయతీరాజ్, ఖీచిూ అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. వివిధ ఆసుపత్రుల్లో బాధితులకు అందిస్తున్న వైద్యసహాయంపై మంత్రికి డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు వివరించారు. పారిశుధ్య నిర్వహణ



పనులపై డిపిఒ వెంకటేశ్వరరావు తెలియజేశారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలపై మంత్రి అధికారులతో చర్చించారు. తాగునీటి పథకాల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతపై కూడా రిపోర్టులు సేకరించాలని మంత్రి ఆదేశించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని మంత్రి చెప్పారు.డయేరియా తో ఏడుగురు చనిపోవడం పై వైసిపి జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ఘాటుగా స్పందించారు. జిల్లా కేంద్రానికి పదిహేను కిలోమీటర్ల దూరంలో జరిగిన ఘటన దురదృష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా వైద్యం పడకేసిందని, వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని మండిపడ్డారు. డయోరియా మరణాలన్ని ప్రభుత్వ మరణాలని, తక్షణమే బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రబలిన డయోరియా ఘటన పై ముఖ్యమంత్రి కార్యలయం కూడా వెంటనే స్పందించింది. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించింది. జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూడా వెంటనే రంగంలోకి దిగి చర్యలకు చేపట్టారు. గుర్ల గ్రామాన్ని సందర్శించడంతో పాటు డయేరియా బాధితులను కూడా కలిసి పరిస్థితి పై ఆరా తీశారు. డయోరియా అదుపు చేసేందుకు అదనపు వైద్య సిబ్బందిని నియమించి గ్రామంలో క్లోరినేషన్ జరిపించారు. గ్రామంలో డయోరియా అదుపులోకి వచ్చే వరకు వైద్య ఉన్నతాధికారులు గ్రామంలో ఉండి పర్యవేక్షించాలని ఆదేశించారు.

## రైలు బస్సు కావాలంటున్న కోనసీమ వాసులు




**కాకినాడ, అక్టోబరు 21, పెన్ పవర్:** దేశంలోని అన్ని రాష్ట్రాలు టూరిజం పరంగా ఎలాంటి క్రొత్త కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తుంటే ఏపీలో మాత్రం చేతిలో ఉన్న ఒక గొప్ప అవకాశాన్ని రైల్వే పక్కన పెట్టేస్తుంది. అదే " రైలు బస్సు". రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంకెక్కడా లేని అరుదైన " రైలు బస్సు" నిన్న మొన్నటి వరకూ ఏపీలో తిరిగేది. అయితే కరోనా పేరు చెప్పి దానిని రద్దు చేసింది డిపార్ట్మెంట్.కోనసీమకు రైలు తేవాలని దివంగత లోక్ సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చేసిన కృషి ఫలితంగా కాకినాడ నుంచి కోటిపల్లి వరకూ రైల్వే లైన్ ఏర్పడింది. అక్కడి నుంచి గోదావరి మీదుగా బ్రిడ్జి నిర్మించి నర్సాపూర్‌కు లింక్ ఏర్పాటు చేస్తే కోనసీమకు రైల్వే లైన్ వచ్చేసినట్టే. అయితే ఈ లోపే ప్రమాదవశాత్తు బాలయ్య మరణించారు. దీంతో కోటిపల్లి– నరసాపురం పనులు నెమ్మదించాయి. ఆ టైం గ్యాప్ లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు ఆల్రెడీ ఏర్పడి ఉన్న రైల్వే లైన్ పై రైలు బస్సు తిరిగేది. 77271 నెంబర్ గల ఈ రైలు బస్సు కాకినాడలో ఉదయం 9:30కు మొదలై కొవ్వాడ, వాకాడ, వేలంగి, ద్రాక్షారామం, రామచంద్రపురం మీదుగా ప్రయాణించి ఉదయం 11:30కు కోటిపల్లి చేరుకునేది. కాకినాడ నుంచి కోటిపల్లి మధ్యలో 8 స్టేషన్‌లలో ఆగేది. ఈ ట్రైన్ ప్రయాణ దూరం 45 కిలోమీటర్లు. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు బస్సు (77272) 12 గంటలకు కోటిపల్లిలో బయలుదేరి రెండు గంటలకు కాకినాడ చేరుకునేది.అసలు ఈ "రైలు బస్సు" చూడడానికే చాలా ముద్దుగా ఉండేది. దీనికి టికెట్లు రైలు బస్సు లోపలే ఇచ్చేవారు. దీన్ని నడిపే డ్రైవరే టికెట్లు ఇచ్చుకోవాలి. అలాగే తనే దిగి వెళ్లి రైలు గేటు వేసుకుని రైలు బస్సు ముందుకు వెళ్లిన తర్వాత వెనక్కి వచ్చి గేటు తెరవాలి. ఇలా పచ్చని పొలాల మధ్య కోనసీమ అందాలు చూస్తూ రైలు బస్సులో ప్రయాణించడం భలే ఉండేది. అప్పట్లో కాకినాడ నుంచి కోటిపల్లికి బస్సు చార్జి 30 రూపాయలు. రైలు బస్సు ఛార్చ్ మాత్రం పది రూపాయలే. పైగా అప్పట్లో రోడ్లు పెద్దగా బాగుండేవి కావు. దానితో చిరు వ్యాపారులు రైలు బస్సును ఆశ్రయించేవారు. రాను రాను రైలు బస్సు కెపాసిటీ చిన్నది కావడం, వచ్చే ఆదాయం తక్కువ కావడంతో దక్షిణ మధ్య రైల్వే "రైలు బస్సు" ను పలమార్లు రద్దు చేసింది. ఈ లోపు కరోనా రావడంతో "రైలు బస్సు " పూర్తిగా రద్దు అయ్యింది." రైలు బస్సు"ను మళ్ళీ ప్రారంభించాలని ఉన్నా దానిపై వచ్చే ఆదాయం రైలు బస్సు నడపడానికయ్యే ఖర్చు కంటే తక్కువ వస్తుందని అందుకే దానిని రివైవ్ చేయడం లేదని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌చెందిన నుస్రత్ మంద్రుపకర్ తెలిపారు. ప్రస్తుతం కాకినాడ ఎంపీ ఉదయ్, ఏపీ టూరిజం మినిస్టర్ కందుల దుర్గేష్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ, కాకినాడ పక్కనే ఉన్న పిఠాపురం ఎమ్మెల్యే జనసేన చేతిలోనే ఉన్నాయి. కేంద్రంలో జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పలుకుబడి చాలా ఎక్కువే. కనుక ఒక్కసారి జనసేన దృష్టి పెడితే కాకినాడ– కోటిపల్లి "రైలు బస్సు" మళ్ళీ పట్టాలెక్కుతుంది. కరోనా తర్వాత ఉద్ధృతమైన సోషల్ మీడియా ప్రభంజనం అంతకు ముందు లేదు. అందువల్ల "రైలు బస్సు" గోదావరి జిల్లాల బయట పెద్దగా పాపులర్ కాలేదు. ఇప్పుడు దాన్నేమళ్ళీ స్టార్ట్ చేసి టూరిజం పరంగా పబ్లిసిటీ చేస్తే అటు రైల్వేకు ఆదాయం ఇటు రాష్ట్రానికి పర్యాటకం పరంగా మంచి పేరు రావడం ఖాయం.

## చంద్రబాబు, పవన్ కు మోదీ నిర్దేశం..



**కాకినాడ, అక్టోబరు 21, పెన్ పవర్:** దేశంలో ఒకే ఒక్క ఎన్నికలు తేవాలన్నది మోడీ టార్గెట్. కేంద్రంలో హ్యాట్రిక్ కొట్టిన మోడీ.. ఎన్నికల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావాలని భావిస్తున్నారు. అందుకు వ్యతిరేక కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఎన్డీఏ భాగస్వామి పక్షాలు మాత్రం ఆహ్వానిస్తున్నాయి. మోడీ అనుకున్నట్టు జరిగితే ఏపీలో రాజకీయాలు ఒక్కసారిగా మారనున్నాయిఏపీలో కూటమి నేతల స్వరం మారుతోంది. వారి నోట ఎన్నికల మాట వినిపిస్తోంది.కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సమాయత్తం అవుతున్న వేళ.. ఏపీలో కూటమి పార్టీల నేతలు సైతం అందుకు సిద్ధమవుతున్నట్లు సంకేతాలు వస్తున్నాయి. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చింది. తిరుగులేని విజయం సాధించింది. 175 అసెంబ్లీ సీట్లకు గాను.. ఏకంగా 164 స్థానాలతో సత్తా చాటింది. వైసీపీ 11 స్థానాలకే పరిమితం అయ్యింది. కనీసం ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో బిజెపి.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామి అయింది. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొలువుదీరి నాలుగు నెలలు అవుతోంది. కానీ కేంద్రం మాత్రం ఈసారి జమిలికి సిద్ధపడుతోంది. లోక్సభ తో పాటు అన్నిరాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించి అత్యున్నత కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదికలు కూడా ఇచ్చేసింది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి ఆమోదం ముద్ర వేయాలని కేంద్రం భావిస్తోంది. అయితే ఇండియా కూటమి వ్యతిరేకిస్తుండగా.. భాగస్వామ్య పార్టీలుగా ఉన్న టిడిపి ఆహ్వానించింది. చంద్రబాబు సైతం మద్దతు తెలిపారు.అయితే కేంద్ర చర్యలతో ఇప్పుడు ఏపీలో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. ముందస్తు ఎన్నికలు వస్తాయని అంచనా వేస్తున్న విపక్ష నేత జగన్ పార్టీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తున్నారు. 2027 ద్వితీయార్థంలో ఎన్నికలు తప్పకుండా వస్తాయని భావిస్తున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న వైసీపీకి ఇది మంచి తరుణం అని భావిస్తున్నారు. మళ్లీ పార్టీ పూర్వ వైభవం సాధిస్తుందని నమ్మకంగా చెబుతున్నారు. పార్టీ బలోపేతం పై పూర్తి దృష్టి పెట్టారు. నాలుగు నెలల పాలనలో టిడిపి కూటమి సర్కార్ విఫలమైందని ఆరోపిస్తున్నారు.అయితే జమిలి ఎన్నికల విషయంలో చంద్రబాబు కేంద్రపెద్దలకు పూర్తి మద్దతు ప్రకటించారు. హర్యానాలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల సమావేశ అనంతరం సైతం ఇదే విషయం చెప్పుకొచ్చారు. నిన్న పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో జరిగిన సమావేశంలో సైతం ముందస్తు ఎన్నికల ప్రస్తావన ఎక్కువగా తీసుకొచ్చారు. ప్రధాని మోదీ గెలుపు ఫార్ములాను ప్రస్తావించారు. గుజరాత్ లో వరుసగా బిజెపి గెలిచిన వైనాన్ని వివరించే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి కొద్దికాలం పాటు ముందుకు సాగితేనే రాష్ట్ర ప్రయోజనాలు సాధ్యమని తేల్చి చెప్పారు. అందుకే మిగతా రెండు పార్టీలతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అయితే అదే సమయంలో పవన్ సైతం కేంద్ర పెద్దల ఎన్నికల నిర్వహణకు మద్దతు తెలిపారు. ప్రధాని మోదీ ఆయనకు దిశా నిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. మొత్తానికైతే మోదీ సూచనతో చంద్రబాబు, పవన్ రాజకీయ ఆట ప్రారంభించారు. ఎంతవరకు తీసుకెళ్తారో చూడాలి.

## మర్చిపోలేని క్షణాలు: ఒకే రోజు న్యూజిలాండ్ రెండు చారిత్రాత్మక విజయాలు






**హైదరాబాద్ పెన్ పవర్:** 2024 అక్టోబర్ 20.. న్యూజీలాండ్ క్రికెట్ చరిత్రలో మర్చిపోలేని రోజు. మధ్యాహ్నం మెన్స్ క్రికెట్ భారత గడ్డపై 36 ఏళ్ళ తర్వాత టెస్ట్ విజయాన్ని అందుకొని టీమిండియాకు బిగ్ షాక్ ఇచ్చింది. ఆదివారం (అక్టోబర్ 20) ముగిసిన మ్యాచ్ లో అద్భుతంగా ఆడుతూ బెంగళూరు టెస్టులో 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. దీంతో మూడు మ్యాచ్ ల సిరీస్ లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. చివరిసారిగా కివీస్ 1988 లో భారత్ పై ముంబైలో టెస్ట్ మ్యాచ్ గెలిచింది. ఆ తర్వాత ఈ 36 ఏళ్లలో ఓడిపోవడం లేదా డ్రా చేసుకోవడమే సరిపోయింది.

ఇండియా ఇచ్చిన 107 రన్స్ టార్గెట్‌ను కివీస్ రెండు వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది. బుమ్రా దెబ్బకు టామ్ లాథమ్ (0), డెవాన్ కాన్వే (17) ఔటైనా విల్ యంగ్ (48 నాటౌట్) రచిన్ రవీంద్ర (39 నాటౌట్) మూడో వికెట్‌కు 75 రన్స్ జోడించి తమ జట్టును గెలిపించారు. ఇండియాలో ఆడిన 37 టెస్టుల్లో న్యూజిలాండ్‌కు ఇది మూడో విజయం. ఇది వరకు 1969 నాగ్‌పూర్‌లో, 1988లో ముంబైలో గెలిచింది. ఇండియా గడ్డపై వంద రన్స్ పైచిలుకు టార్గెట్‌ను పర్యాటక జట్టు ఛేదించడం 24 ఏండ్లలో ఇదే తొలిసారి. ఈ

విజయానందాన్ని రెట్టింపు చేస్తూ రాత్రి న్యూజిలాండ్ మహిళల జట్టు టీ20 వరల్డ్ కప్ గెలుచుకుంది. దీంతో విమెన్స్ టీ20 వరల్డ్ కప్‌లో తొలిసారి విజేతగా నిలిచింది. 2009, 2010 ఎడిషన్లలో ఫైనల్లో ఓడిన కివీస్.. తమ మూడో ఫైనల్లో మెప్పించి ఎట్టకేలకు టీ20 కిరీటాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు వరుసగా రెండోసారి ఫైనల్‌కు వచ్చిన సౌతాఫ్రికాకు మళ్లీ నిరాశే మిగిలింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన కివీస్ ఆదివారం జరిగిన ఫైనల్లో 32 రన్స్ తేడాతో సఫారీలను ఓడించింది. ఈ రెండు విజయాలతో న్యూజిలాండ్ దేశంలో సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి.

## రెండో టెస్టుకు నో ఛాన్స్.. రాహుల్ చివరి టెస్ట్ ఆడేశాడా..

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ టెస్ట్ కెరీర్ సందిగ్ధంలో పడింది. బెంగళూరు వేదికగా న్యూజిలాండ్ తో జరిగిన తొలి టెస్టులో రాహుల్ పేలవ ఫామ్ తో జట్టు ఓటమికి కారణమయ్యాడు. తొలి ఇన్నింగ్స్ లో డకౌట్ కాగా.. సెకండ్ ఇన్నింగ్స్ లో 12 పరుగులు మాత్రమే చేశాడు. ముఖ్యంగా సెకండ్ ఇన్నింగ్స్ లు అందరూ బాధ్యతగా ఆడితే రాహుల్ మాత్రం సీనియర్ బ్యాటర్ అయి ఉండి జట్టును కష్టాల్లో నెట్టాడు. దీంతో ముంబైలో జరగబోయే సెకండ్ టెస్టుకు అతడిపై వేటు ఖాయంగా కనిపిస్తుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరమైన గిల్ కోలుకున్నాడని.. అతను రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని కన్ఫర్మ్ చేశాడు. దీంతో గిల్ ఎవరి ప్లేస్ లో ఆడతాడని దానిపై డిబేట్ జరుగుతుంది. గిల్ స్థానంలో తొలి టెస్టులో అవకాశం దక్కించుకున్న సర్ఫరాజ్ బెంగళూరు టెస్టులో ఆకట్టుకున్నాడు. తొలి ఇన్నింగ్స్ లో డకౌట్ అయినా.. రెండో ఇన్నింగ్స్ లో 150 పరుగులు భారత టాప్ స్కోరర్ గా నిలిచాడు. దీంతో అతడిని తప్పించే ప్రసక్తే లేదు. మరోవైపు రాహుల్ టెస్ట్ సగటు కేవలం 33.98 మాత్రమే ఉండడం అతనికి మైనస్ గా మారింది. టీమిండియా సెలక్టర్లు కూడా కుర్రాళ్ళ వైపే మొగ్గు చూపుతున్నారు. సర్ఫరాజ్, జైశ్వాల్, గిల్, పంత్ లాంటి ఆటగాళ్లు తమకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ దూసుకెళ్తున్నారు. అభిమన్యు ఈశ్వరన్, గైక్వాడ్ లాంటి యువ ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ లో సత్తా చాటుతూ గట్టి పోటీ ఇస్తున్నారు. ఈ కారణంగానే దశాబ్దకాలంగా భారత జట్టుకు వెన్నుముకల నిలిచిన పుజారా, రహానేలను సెలక్టర్లు తప్పించారు. ఒకవేళ రెండో టెస్టుకు రాహుల్ బెంచ్ కు పరిమితమైతే అతని టెస్ట్ కెరీర్ దాదాపుగా ముగిసినట్టే. ఆస్ట్రేలియా పర్యటనకు అతన్ని పరిగణలోకి తీసుకోవడం కష్టంగా కనిపిస్తుంది.



## భారత క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్... మహ్మద్ షమీ వచ్చేస్తున్నాడు!




**హైదరాబాద్ పెన్ పవర్:** గతేడాది స్వదేశంలో జరిగిన వన్డే వరల్డ్‌కప్‌లో గాయపడిన టీమిండియా పేసర్ మహ్మద్ షమీ ఎట్టకేలకు పూర్తిగా కోలుకున్నాడు. ఈ మేరకు షమీ సోమవారం ఒక సందేశాన్ని అభిమానులతో పంచుకున్నాడు. ఇప్పుడు తాను వందకు వందశాతం ఎలాంటి నొప్పి లేకుండా ఫిట్‌గా ఉన్నట్లు పేర్కొన్నాడు. ఆదివారం నాడు బెంగళూరులో న్యూజిలాండ్‌తో తొలి టెస్టు ముగిసిన తర్వాత షమీ నెట్స్‌లో చెమటోడ్చాడు. ఈ సందర్భంగా పూర్తి సెషన్ బౌలింగ్ వేయడం తనకు సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు. ఇక గతేడాది చీలమండ గాయం కారణంగా సర్జరీ చేయించుకున్న షమీ అప్పటి నుంచి పూర్తిగా క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే ప్రాక్టీసు మొదలుపెట్టాడు.అయితే, మళ్లీ అతని మోకాళ్లలో వాపు వచ్చిందని, ఇది షమీ జట్టులో పునరాగమనంపై ప్రభావం చూపించే అవకాశం ఉందంటూ కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవల వెల్లడించాడు. హిట్‌మ్యాన్ అలా చెప్పిన రోజుల వ్యవధిలోనే తాజాగా షమీ తాను పూర్తిగా కోలుకున్నట్లు చెప్పుకొచ్చాడు. బౌలింగ్ చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. అంతకుముందు కేవలం హాఫ్ రన్‌అప్‌తో బౌలింగ్ చేశాను. ఎందుకంటే నేను ఎక్కువ వర్క్‌లోడ్ తీసుకోకూడదనుకున్నాను. కానీ, నిన్న నేను పూర్తిగా స్థాయిలో మునుపటి షమీలా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాను. మంచి స్పీడ్‌తో బౌలింగ్ వేశాను. ఫలితం బాగుంది. ప్రస్తుతం నేను 100 శాతం నొప్పి లేకుండా ఉన్నాను. ఆస్ట్రేలియా సిరీస్‌కి అందుబాటులో ఉంటానా లేదా అని చాలా కాలంగా అందరూ ఆలోచిస్తున్నారు. అయితే దానికి ఇంకా కొంత సమయం ఉంది" అని 'యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్' ఈవెంట్ సందర్భంగా విలేకరులతో షమీ చెప్పాడు.ఇక కీలకమైన ఆస్ట్రేలియా టూర్‌కు ముందు షమీ తన రాష్ట్ర జట్టు బెంగాల్ తరఫున బరిలోకి దిగాలని అనుకుంటున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీలో రెండు మ్యాచ్‌లు ఆడాలనుకుంటున్నట్లు చెప్పాడు. తద్వారా తన ఫిట్‌నెస్ లెవెల్‌పై ఒక అంచనాకు రావచ్చని అన్నాడు. ఇక షమీ తాజా సందేశంతో భారత క్రికెట్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్టార్ పేసర్ కోలుకోవడం టీమిండియాకు కలిసి వస్తుందని, ఆసీస్ గడ్డపై భారత్‌కు ఎదురులేకుండా ఉంటుందని సంబరపడుతున్నారు.

## మీనాక్షికి మంచి రోజులొచ్చినట్టేనా..?

అబ్బురపరిచే రెడ్ డ్రెస్‌లో సారా అలీ ఖాన్ స్టన్స్





శ్రద్ధా కపూర్ లుక్ ఒక ఫ్యాషన్ ప్రేమికుల క



మీనాక్షికి మంచి రోజులొచ్చినట్టేనా..? సుశాంత్ హీరోగా వచ్చిన ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరి. ఆ తర్వాత వరుసగా యువ హీరోల సరసన ఛాన్స్ అందుకుంది. ఐతే మహేష్ బాబుతో గుంటూరు కారం, తమిళ హీరో దళపతి విజయ్ తో గోట్ సినిమాలో నటించిన మీనాక్షి ఆ సినిమాలతో పెద్దగా మెస్మరైజ్ చేసింది ఏమి లేదు. ఐతే అమ్మడు మాత్రం ఇప్పుడు వరుస సినిమాలతో రాబోతుంది. ముఖ్యంగా నెల రోజుల్లోనే 3 సినిమాలతో తన లక్ టెస్ట్ చేసుకుంటుంది మీనాక్షి చౌదరి.

మీనాక్షి చౌదరి ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ తో లక్కీ భాస్కర్ సినిమా చేస్తుంది. ఆ సినిమా నవంబర్ ఫస్ట్ వీక్ రిలీజ్ అవుతుంది. ఇదే కాకుండా విశ్వక్ సేన్ తో మెకానిక్ రాకీ, వరుణ్ తేజ్ మట్కా సినిమాల్లో నటిస్తుంది. ఐతే ఈ సినిమాలన్నిటిలో కూడా మీనాక్షి లీడ్ హీరోయిన్ గా నటించడం విశేషం. తప్పకుండా ఈ సినిమాల ఫలితాలు అమ్మడి కెరీర్ కి మంచి బూస్ట్ ఇస్తాయని చెప్పొచ్చు. మంచి ఫాంలోకి రావాల్సిన టైం లో మీనాక్షి ఇలా సైడ్ రోల్స్ చేయడంతో ఆడియన్స్ షాక్ అయ్యారు. కానీ అమ్మడు త్వరగానే తిరిగి కరెక్ట్ రూట్ లోకి వెళ్తుంది. రాబోతున్న సినిమాల్లో ఏ ఒక్క రోల్ క్లిక్ అయినా సరే మీనాక్షికి మంచి రోజులు వచ్చినట్టే అని చెప్పొచ్చు. అటు మహేష్, విజయ్ లాంటి హీరోలతో చేసినా యువ హీరోలకు అమ్మడు బెస్ట్ ఆప్షన్ అనిపిస్తుంది. ఎలాగు తన ఛార్మింగ్ తో ఎట్రాక్ట్ చేస్తున్న ఈ అమ్మడు కొద్దిగా ట్రై చేస్తే సౌత్ టాప్ హీరోయిన్ రేంజ్ కి వెళ్లే ఛాన్స్ కూడా ఉంది. మీనాక్షి కూడా తన ప్రతి సినిమాకు తన ఫుల్ ఎఫర్ట్స్ పెట్టేస్తుంది. రాబోయే సినిమాలకు అమ్మడికి కాస్త లక్ ఫేవర్ చేస్తే మాత్రం మీనాక్షి మేనియా కొనసాగించే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. మరి మీనాక్షి లక్ ఎలా ఉంది.. ఈ 3 సినిమాల తర్వాత అమ్మడి ఫేట్ మారుతుందా లేదా అన్నది చూడాలి. విశ్వక్, దుల్కర్, వరుణ్ తేజ్ ముగ్గురు యువ హీరోలతో మీనాక్షి మూవీస్ ఆమె కెరీర్ కు ఎంతమేరకు హెల్ప్ అవుతాయన్నది చూడాలి.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com